8వ రోజుకు కలెక్టరేట్ ఉద్యోగుల నిరసన

భీమవరం: తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని భీమవరం కలెక్టరేట్ ఉద్యోగులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఏపి ఐకాస రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా భీమవరం కలెక్టరేట్ వద్ద కలెక్టరేట్ ఉద్యోగులు చేపట్టిన నిరసన గురువారానికి ఎనిమిదో రోజుకు చేరింది. వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. పిఆర్‌సి బకాయిలు విడుదల ఇవ్వాలని, ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగుల సర్వీసులను క్రమబద్ధీకరించాలని, సచివాలయాల్లో ఉద్యోగులకు ఆక్ష్యాలను తొలగించి పని ఒత్తిడి తగ్గించాలని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరమయ్యేవరకూ ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ పరిపాలనాధికారి వై.దుర్గాకిషోర్, సూపరింటెండెంట్ ఎస్.సుబ్రహ్మణ్యం, సీనియర్ సహాయకులు వి.వి.పెద్దిరాజు పాల్గొన్నారు.

రిటర్నింగ్ అధికారి అరుణ్‌బాబు నుంచి ఎంఎల్‌సిగా ఎన్నికైనట్లు ధ్రువీకరణ పత్రాలు అందుకుంటున్న కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్

వైసిపి విజయదుందుభి

స్థానిక సంస్థల రెండు ఎంఎల్‌సి స్థానాలు కైవసం

మొదటి ప్రాధాన్యతా ఓటుతోనే సునాయాసంగా గెలుపు

ప్రతిపక్షాల ఓట్లు అధికారపక్షం ఖాతాలోకే

ఈ గెలుపు జగన్ పాలనకు నిదర్శనం

విజేతలు కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికల్లో రెండు ఎంఎల్‌సి స్థానాలను వైసిపి కైవసం చేసుకుంది. శాసనమండలి సభ్యులుగా వైసిపి అభ్యర్థులైన జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ గెలుపొందారు. ఈ నెల 13న స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికలకు సంబంధించిన ఓట్ల లెక్కింపు గురువారం ఏలూరు ఎంపిడిఒ కార్యాలయంలో జరిగింది. ఉదయం ఎనిమిది గంటలకు అభ్యర్థులు, ఏజెంట్ల సమక్షంలో స్ట్రాంగ్ రూమ్ తెరిచి ఐదు టేబుళ్లపై ఓట్ల లెక్కింపు చేపట్టారు. ఓట్ల లెక్కింపు చేపట్టిన గంట వ్యవధిలోనే ఫలితాలు వెలువడ్డాయి. వైసిపి అభ్యర్థి కవురు శ్రీనివాస్ మొదటి ప్రాధాన్యతా ఓట్లు 481 సాధించారు, మరో అభ్యర్థి వంకా రవీంద్రనాథ్ 460 సాధించారు. టిడిపి బలపర్చిన స్వతంత్ర అభ్యర్థి వీరవల్లి చంద్రశేఖర్‌కు 122 ఓట్లు లభించాయి. మిగిలిన స్వతంత్ర అభ్యర్థులు గోరింక దాసు, దేవరపల్లి ఆదాం, పసల వెంకటాచలంకు ఒక్క ఓటు కూడా రాలేదు. స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి మొత్తం 1,105 ఓట్లకుగాను 1088 ఓట్లు పోలయ్యాయి. వాటిలో 1,063 ఓట్లు చెల్లుబాటయ్యాయి. 25 ఓట్లు చెల్లనివిగా తేలాయి. చెల్లుబాటైన 1,063 ఓట్లలో 941 ఓట్లు మొదటి ప్రాధాన్యతగా వైసిపికే దక్కాయి. దీంతో వైసిపి అభ్యర్థులు గెలుపు ఖరారైంది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఎంఎల్‌సి ఎన్నికల పరిశీలకులు, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్, ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్నవెంకటేష్, పశ్చిమగోదావరి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, రిటర్నింగ్ అధికారి పి.అరుణ్‌బాబు ఓట్ల లెక్కింపును పరిశీలించారు.

విజేతలకు ధ్రువీకరణ పత్రాలు అందజేత

ఉదయం తొమ్మిది గంటలకే ఫలితాలు వెల్లడైనప్పటికీ మధ్యాహ్నం వరకూ అధికారికంగా ప్రకటించలేదు. గురువారం మధ్యాహ్నం అధికారికంగా ఫలితాలు ప్రకటించారు. ఎంఎల్‌సిలుగా గెలుపొందిన కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్‌లకు రిటర్నింగ్ అధికారి పి.అరుణ్‌బాబు ధ్రువీకరణపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా విజేతలను ఏలూరు ఎంఎల్ఎ ఆళ్ల నాని, ఏలూరు నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు ఎస్‌ఎంఆర్.పెదబాబు తదితరులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియలో డిఆర్‌ఒ ఎవిఎన్ఎస్.మూర్తి, ఆర్‌డిఒలు కె.పెంచల్‌కిషోర్, దాసి రాజు, డిఆర్‌డిఎ పీడీ విజయరాజు, సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ డైరెక్టర్ మధుసూదనరావు, డ్వామా పీడీ రాంబాబు, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ రామకృష్ణ, తహశీల్దార్ సోమశేఖర్ పాల్గొన్నారు.

కౌంటింగ్‌ను పరిశీలిస్తున్న పశ్చిమ కలెక్టర్ ప్రశాంతి

కౌంటింగ్‌ను పరిశీలిస్తున్న ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రశాంతి

ప్రతిపక్షాల ఓట్లు వైసిపికే

స్థానిక సంస్థల ఎంఎల్‌సి ఎన్నికలకు సంబంధించి మొత్తం 1,105 ఓట్లు ఉండగా వీటిలో 920 ఓట్లు వైసిపికి చెందినవారివే. 185 మంది టిడిపి, జనసేన, ఇతర పార్టీలు, స్వతంత్రులైన ప్రజాప్రతినిధులు ఉన్నారు. అధిక ఓట్లు ఉన్న వైసిపికి రెండుస్థానాలు ఏకగ్రీవంగా దక్కాల్సి ఉంది. అయితే టిడిపి నలుగురు స్వతంత్ర అభ్యర్థులను రంగంలోకి దింపింది. వీరిలో వీరవల్లి చంద్రశేఖర్‌కు టిడిపి అధికారికంగా మద్దతు ప్రకటించింది. అధికార పార్టీకి సంబంధించిన ఓట్లు చీలితే స్వతంత్ర అభ్యర్థి గెలుపు ఖాయమనే ప్రచారం సాగింది. మొత్తం 1,088 ఓట్లు పోలవగా వీటిలో వైసిపి అభ్యర్థులకు 941, టిడిపి బలపర్చిన స్వతంత్ర అభ్యర్థికి 122 ఓట్లు వచ్చాయి. అంటే ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఓటర్లు సైతం వైసిపి అభ్యర్థులకే ఓటేసినట్లు తేట తెల్లమైంది.

అధికార పార్టీకి కలిసొచ్చిన డబ్బు పంపిణీ

స్వతంత్ర అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలవడంతో వైసిపిలో గుబులు మొదలైంది. దీంతో తమ ఓటర్లను కాపాడు కునేందుకు నియోజకవర్గాలవారీగా సమావేశాలు ఏర్పాటు చేయాల్సి వచ్చింది. తమకు డబ్బులిస్తేనే ఓటు వేస్తామనే డిమాండ్ వ్యక్తమవడంతో వైసిపి నాయకులు కంగుతిన్నారు. డబ్బు పంపిణీ చేయకపోతే ఓట్లు చీలి స్వతంత్ర అభ్యర్థికి వెళ్లే అవకాశం ఉందని అంచనా వేశారు. దీంతో ఓటుకు రూ.20 వేలు చొప్పున అధికార పార్టీ తమ సొంత ఓటర్లకు పంపిణీ చేయాల్సి వచ్చింది. ప్రతిపక్ష పార్టీల ఓటర్లకు కూడా డబ్బు పంపిణీ చేశారు. ఆ కారణంగానే ప్రతిపక్ష పార్టీల ఓటర్లు కూడా వైసిపి అభ్యర్థులకే ఓటు వేసినట్లు తెలుస్తోంది. రెండు స్థానాలను వైసిపి కైవసం చేసుకోవడంతో వైసిపి శ్రేణుల్లో ఆనందోత్సాహాలు వెల్లువెత్తాయి.

టేబుల్ల వారీ అభ్యర్థులకు వచ్చిన ఓట్లు

అభ్యర్థి పేరు	టేబుల్-1	టేబుల్-2	టేబుల్-3	టేబుల్-4	టేబుల్-5	మొత్తం
కవురు శ్రీనివాస్	45	96	76	151	113	481
వంకా రవీంద్ర	130	72	87	80	91	460
వి.చంద్రశేఖర్	23	24	33	15	27	122
చెల్లని ఓట్లు	2	8	4	4	7	25

మొత్తం చెల్లుబాటు అయిన ఓట్లు: 1063
చెల్లనివి: 25

స్వతంత్ర అభ్యర్థులు: గోరింక దాసు, దేవరపల్లి ఆదాము, పసల వెంకటాచలంకు ఒక్క ఓటు కూడా రాలేదు.

మెరుగైన పాలనకు నిదర్శనమే ఈ గెలుపు

కవురు శ్రీనివాస్

పేద ప్రజలకు నవరత్నాల పేరుతో ఎన్నో పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోంది. కులమతాలకు అతీతంగా పథకాలు అందిస్తోంది. మెరుగైన పాలనకు బహుమతిగా దక్కిందే ఈ గెలుపు. ప్రతిపక్ష పార్టీల ఓట్లు కూడా మాకు పడటమే దీనికి నిదర్శనం.

ఈ విజయం జగన్ సంక్షేమ పాలనకు నిదర్శనం

వంకా రవీంద్రనాథ్

రాష్ట్రంలో ప్రజలకు జగన్ అందిస్తున్న సంక్షేమ పథకాల ఫలితమే ఎంఎల్‌సి ఎన్నికల్లో విజయం. ప్రతిపక్షపార్టీల ఓటర్లు కూడా తమకే ఓటు వేయడం అందుకు నిదర్శనం. టిడిపికి మద్దతు లేదని తెలిసి స్వతంత్ర అభ్యర్థిని రంగంలోకి దింపి మద్దతిచ్చారు. ఈ తీరు దారుణం. స్థానిక సంస్థల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తాను.

అన్నీ అరకొరే..!

సాగునీటి ప్రాజెక్టులకు నామమాత్ర కేటాయింపులు

చింతలపూడికి రూ.272 కోట్లు, తాడిపూడికి రూ.22 కోట్లే

పోలవరం ప్రాజెక్టుకు రూ.5004 కోట్లు

డెల్టా ఆధునికీకరణకు రూ.12 కోట్లు విదిలింపు

ఆక్వా రైతుల విద్యుత్ రాయితీలపై మౌనం

కొల్లేరు రెగ్యులేటర్ల ప్రస్తావన కరువు

ఫిషింగ్ హార్బర్, ఆక్వా యూనివర్సిటీ ఊసే లేదాయె

నిర్వాసితుల హామీలకు కానరాని కేటాయింపులు

జిల్లావాసులను నిరాశపర్చిన రాష్ట్ర బడ్జెట్

2023-24 రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో జిల్లాకు సరైన కేటాయింపులు లేకుండాపోయాయి. ముఖ్యమైన సాగునీటి ప్రాజెక్టులకు అరకొర కేటాయింపులతో సరిపెట్టారు. అభివృద్ధి పనులకు సంబంధించిన నిధుల గురించి ప్రస్తావన లేకుండాపోయింది. కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణం, ఫిషింగ్ హార్బర్, ఆక్వా యూనివర్సిటీ ఊసే లేకుండాపోయింది. పోలవరం నిర్వాసితుల హామీలకు సంబంధించి నిధుల వివరాలు ఎక్కడా కన్పించలేదు. మొత్తంగా బడ్జెట్‌లో జిల్లాకు మొండిచెయ్యి చూపారు. పోలవరం ప్రాజెక్టుకు కేటాయించిన నిధులు ఒకింత ఊరటగా చెప్పొచ్చు.

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి గురువారం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో జిల్లాకు మొండిచెయ్యి చూపారు. దశాబ్దాల కాలంగా సాగుతున్న సాగునీటి ప్రాజెక్టు పనులకు ఈ బడ్జెట్‌లోనూ సరైన కేటాయింపులు లేకుండాపోయాయి. అరకొర కేటాయింపులతో మమ అన్పించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకానికి సంబంధించి కేవలం రూ.272 కోట్లు మాత్రమే కేటాయించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి తక్షణం పూర్తి చేయాల్సిన మెయిన్ కెనాల్‌కు రూ.1500 కోట్లు అవసరం. 4.80 లక్షల ఎకరాలకు సాగునీరందించే ప్రాజెక్టుకు బడ్జెట్‌లో చేసిన కేటాయింపులు చూసి అంతా ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ విధంగా కేటాయిస్తే మరో రెండు దశాబ్దాలు గడిచినా చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తయ్యే పరిస్థితి ఉండదని చెప్పొచ్చు. చేసిన పనులకు పెండింగ్ బిల్లులే రూ.149 కోట్లు వరకూ ఉన్నాయి. కేటాయించిన నిధులు చేసిన పనుల చెల్లింపులకే సగం సరిపోతాయి. మిగిలే కొద్దిపాటి నిధులతో ప్రాజెక్టు పనులు ఏవిధంగా ముందుకు సాగుతాయో ప్రభుత్వమే చెప్పాలి. 2008లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టును ఎప్పటికి పూర్తి చేస్తారో పాలకులే చెప్పాలి. మరో ఎత్తిపోతల పథకం తాడిపూడికి సైతం ఈ బడ్జెట్‌లో రూ.22 కోట్లు మాత్రమే కేటాయించారు. పిల్ల కాలువల తవ్వకాలు పూర్తయితే 2.60 లక్షల ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వానికి పట్టని పరిస్థితి నెలకొంది. 2004లో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు ఇప్పటికీ పూర్తిస్థాయిలో సాగు నీరందించలేని దుస్థితి ఉంది. ప్రభుత్వాలు మారుతున్నా ప్రాజెక్టు మాత్రం పూర్తి కావడం లేదు. ఈ ప్రాజెక్టుకు రూ.200 కోట్లు కేటాయిస్తే పూర్తయ్యే అవకాశం ఉన్నా పాలకులు పట్టించుకోని పరిస్థితి ఉంది. ఇక కొవ్వాడకు సంబంధించి రూ.5.29 కోట్లు కేటాయించగా, ఎర్రకాలువ ప్రాజెక్టుకు రూ.8.43 లక్షలు కేటాయించారు. పోలవరం ప్రాజెక్టుకు రూ.5,004 కోట్లు కేటాయింపు మాత్రం కొంత ఊరట కలిగించే అంశంగా చెప్పొచ్చు. పోలవరం ప్రాజెక్టుకు అనుసంధానంగా ఉన్న అన్ని ఇరిగేషన్ పథకాలకు సంబంధించి ఈ నిధుల కేటాయింపు జరిగింది. పోలవరం కేంద్ర ప్రభుత్వ పరిధిలోని ప్రాజెక్టు అయినప్పటికీ కేంద్రం నిధుల విడుదలలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న సంగతి తెలిసిందే. దీంతో ప్రాజెక్టు పనులతోపాటు నిర్వాసితులకు ఇవ్వాల్సిన పరిహారం సైతం ఇవ్వని పరిస్థితి ఉంది. నిర్వాసితులకు పరిహారం అందక ప్రతియేటా విరుచుకుపడే గోదావరి వరదలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పోలవరం నిర్వాసితులకు ఇచ్చిన పునరావాస ప్యాకేజీ రూ.పది లక్షలు, ఎకరాకు రూ.ఐదు లక్షలు అదనంగా ఇస్తామన్న హామీలకు సంబంధించి సైతం నిధుల కేటాయింపు ఎక్కడా కన్పించలేదు.

ఆక్వా రైతుల ఊసే లేదు

ఆక్వా రైతులు విద్యుత్‌కు సంబంధించిన రాయితీలు ఆక్వాజోన్లతో సంబంధం లేకుండా కొనసాగించాలని కోరుతున్నారు. దీనిపై బడ్జెట్‌లో ఎటువంటి ప్రస్తావనా లేకుండాపోయింది. తీవ్ర నష్టాలను చవిచూస్తున్న ఆక్వారైతులకు ఏమాత్రం ఊరట లేకుండాపోయింది. దీంతో ఆక్వా రైతుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. సంక్షేమ పథకాలకు కేటాయింపులు మినహా అభివృద్ధి పనులకు సంబంధించిన ప్రస్తావనే పెద్దగా కానరాలేదు.

డెల్టా ఆధునికీకరణకు రూ.12 కోట్లే

ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రైతులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య డెల్టా ఆధునికీకరణ. కాలువలన్నీ పూడుకుపోయి, షట్టర్లు పాడైపోవడంతో నీటి సరఫరాలో తీవ్ర ఇబ్బందులు ఎదురై రైతులు నష్టాలను చవిచూస్తున్నారు. ఇంకా రూ.600 కోట్లు విలువైన డెల్టా ఆధునికీకరణ పనులు జరగాల్సి ఉండగా ఈ బడ్జెట్‌లో కేవలం రూ.12 కోట్లు మాత్రమే కేటాయించారు. రెండు జిల్లాలకు కలిపి దాదాపు రూ.24 కోట్లు వరకే బడ్జెట్‌లో కేటాయింపులు చూపారు. దీంతో డెల్టా ఆధునికీకరణ ఈ ప్రభుత్వ హయాంలో జరిగే పని కాదని స్పష్టమవుతోంది.

అభివృద్ధి పనులకు నిధులు సున్నా

జిల్లాలో ప్రధానమైన అభివృద్ధి పనులకు కూడా బడ్జెట్‌లో నిధుల కేటాయింపులు కన్పించలేదు. నరసాపురం మండలం బియ్యపుతిప్పలో ఫిషింగ్ హార్బర్, వేములదీవిలో ఆక్వా యూనివర్సిటీ ఏర్పాటుకు సంబంధించి నిధుల కేటాయింపులు లేకుండాపోయాయి. వీటికి రూ.300 కోట్లు చొప్పున అవసరమని అంచనాలు ఉన్నప్పటికీ నిధులు లేక పనులు ముందుకు సాగడం లేదు. ఈ ఏడాది బడ్జెట్‌లోనూ అదే పరిస్థితి నెలకొంది. కొల్లేరులోకి సముద్రపు నీరు రాకుండా దుంపగడప, మొళ్లపర్రు, పడితడక వద్ద మూడు రెగ్యులేటర్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. రూ.412 కోట్లు అంచనాలు సైతం రూపొందించారు. రెగ్యులేటర్ల నిర్మాణానికి సంబంధించి నిధుల కేటాయింపు మాత్రం ఎక్కడా కన్పించలేదు. దగ్గులూరులోని మెడికల్ కాలేజీకి నిధుల ఊసే లేకుండాపోయింది.

ప్రజావసరాలను విస్మరించిన బడ్జెట్ ఇది

బి.బలరాం, సిపిఎం జిల్లా కార్యదర్శి

రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాలోని ప్రధాన సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనులకు నిధుల కేటాయింపు లేకపోవడం బాధాకరం. ప్రధానంగా జిల్లావాసుల అవసరాలను తీర్చే ప్రయత్నం ఎక్కడా కానరాలేదు. పరిశ్రమలు, అక్రమ ఆక్వా సాగు వల్ల ఇప్పటికే జిల్లా కాలుష్యకాసారమైంది. ఆ కాలుష్య నివారణకు అవసరమైన నిధుల కేటాయింపుగాని, ప్రధానంగా వాటర్‌గ్రిడ్ గురించి ప్రస్తావనగానీ లేకుండాపోయింది. కొల్లేరు రెగ్యులేటర్ల నిర్మాణానికి సంబంధించి బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం దారుణం. డెల్టా ఆధునికీరణకు నిధుల కేటాయింపుల్లో నిర్లక్ష్యం రానున్న రోజుల్లో రైతులకు పెనుశాపంగా మారనుంది. ఫిషింగ్ హార్బర్, ఆక్వా యూనివర్సిటీ తదితర అంశాలను ఈ బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం విస్మరించింది.

స్థానిక సంస్థల సమస్యలపై మండలిలో మాట్లాడతా

ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్

ప్రజాశక్తి - తణుకు

స్థానిక సంస్థలు ఎదుర్కొంటున్న సమస్యలను మండలిలో ప్రస్తావించడం ద్వారా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని ఎంఎల్‌సిగా ఎన్నికైన వంకా రవీంద్రనాథ్ చెప్పారు. గురువారం సాయంత్రం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తనను అఖండ మెజార్టీతో గెలిపించిన స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు చిన్ననాటి నుంచి రాజకీయాలపై అవగాహన ఉందని, తన తండ్రి వంకా సత్యనారాయణ మూడుసార్లు ఎంఎల్‌ఎగా పని చేశారని గుర్తు చేశారు. ఆ అవగాహన, అనుభవంతో శాసనమండలిలో ప్రజా సమస్యలను ప్రస్తావించి పరిష్కారానికి నిర్విరామ కృషి చేస్తానన్నారు. ప్రభుత్వం నుంచి స్థానిక సంస్థలకు రావాల్సిన నిధులు రాబట్టడానికి తనవంతు కృషి చేస్తానని చెప్పారు. కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత సమస్యలు ఉన్నాయని, ఆ సమస్యల పరిష్కారానికి ప్రయత్నిస్తానని తెలిపారు. జిల్లాలో వైసిపికి స్థానిక సంస్థల్లో ఉన్న ఓట్లు కన్నా వంద ఓట్లు అదనంగా వచ్చాయని, ఇది ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల ఫలితమని అన్నారు.

హోంమంత్రి, చీఫ్ విప్‌లను కలిసిన కవురు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఎంఎల్‌సిగా ఎన్నికైన కవురు శ్రీనివాస్ గురువారం సాయంత్రం అమరావతిలోని అసెంబ్లీలో రాష్ట్ర హోం శాఖా మంత్రి తానేటి వనిత, ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాద్‌రాజులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట ఎస్‌సి కమిషన్ సభ్యులు చెల్లెం ఆనంద ప్రకాష్, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ, నేతలు గుణ్ణం నాగబాబు, డిటిడిసి బాబు, చిట్టూరి ఏడుకొండలు ఉన్నారు.

విధులకు గైర్హాజరైతే చర్యలు

వీరవాసరం: సచివాలయం సిబ్బంది విధులకు గైర్హాజరైతే సహించేది లేదని భీమవరం డిఎల్‌డిఒ కె.కిషోర్‌కుమార్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన గురువారం తోలకపూడి, అండలూరు సచివాలయాలను సందర్శించి సిబ్బంది హాజరుపై ఆరా తీశారు. ఇదే విధంగా సంక్షేమ పథకాల అమలు, లబ్ధిదారుల ఎంపిక వంటి అంశాలను పరిశీలించారు. ఆయన వెంట శామ్యూల్ ఉన్నారు.

ఆకాశం మేఘావృతం

ప్రజాశక్తి - పెనుమంట్ర

వాతావరణ మార్పులతో ఆకాశం మేఘావృతమై పలుచోట్ల గురువారం చిరుజల్లులు పడ్డాయి. ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం వరకూ వాతావరణం చల్లబడింది. పలుచోట్ల చలిగాలులు వీచాయి. వృద్ధులు, చిన్నారులు ఇళ్లకే పరిమితమయ్యారు.

స్థానిక సంస్థల ఎంఎల్‌సి కవురుశ్రీనివాస్ బయోడేటా

పేరు : కవురు శ్రీనివాస్
స్వగ్రామం : పొలమూరు శివారు నాగళ్లమెరక, పెనుమంట్ర మండలం
తల్లి : కవురు సత్యవతి
తండ్రి : కవురు సర్వారావు
భార్య : బాల త్రిపురసుందరి
పిల్లలు : ఇద్దరు (అమ్మాయిలు)
కులం : బిసి-బి(శెట్టి బలిజ)
చదువు : ఇంటర్మీడియట్, వీరవాసరం
పుట్టిన తేదీ : 15-12-1978
రాజకీయ ప్రస్థానం: వైసిపి తరపున 2014 నుంచి 2019 వరకూ వీరవాసరం ఎంపిపిగా పనిచేశారు. వైసిపి ఆచంట నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా రెండున్నర సంవత్సరాలు, అనంతరం రాజమండ్రి పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షులుగానూ పనిచేశారు. వైసిపి నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గ బిసి సమన్వయకర్తగానూ కొనసాగారు. 2019లో నరసాపురం అసెంబ్లీ ఎన్నికల వైసిపి ఇన్‌ఛార్జిగా, పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా, డిసిసిబి ఛైర్మన్‌గా పలు పదవులను కవురు శ్రీనివాస్ అలంకరించారు.

స్థానిక సంస్థల ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్ బయోడేటా

పేరు: వంకా రవీంద్రనాథ్
పుట్టిన తేదీ: 5 డిసెంబర్ 1968
తల్లిదండ్రులు: నాగమణి, సత్యనారాయణ (తండ్రి సిపిఐ నేత, మూడుసార్లు ఎంఎల్ఎగా గెలుపొందారు)
భార్య: వంకా రాజకుమారి (2004లో తణుకు మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా ఎన్నికయ్యారు)
పిల్లలు: కుమారుడు రఘువీరా, కుమార్తె రవళి
రాజకీయ ప్రస్థానం: పారిశ్రామికవేత్తగా ఉన్న రవీంద్రనాథ్ 2014 ఎన్నికల్లో వైసిపి తరపున నరసాపురం పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. ఆపై వైసిపి కేంద్ర రాజకీయ సలహా కమిటీలో పని చేశారు. వైసిపి నర్సాపురం పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్‌గా, రాజమండ్రి పార్లమెంటు నియోజకవర్గ పరిశీలకునిగా పని చేశారు. వైసిపి అధికారంలోకొచ్చాక ఎంఎస్ఎంఇ ఛైర్మన్‌గా పని చేశారు.

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం

ఒక మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదు

ప్రజాశక్తి - ఏలూరుటౌన్

ఇంటర్ సెకండియర్ పరీక్షలు గురువారం ప్రశాంత వాతావరణంలో ప్రారంభమయ్యాయి. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లావ్యాప్తంగా 106 కేంద్రాల్లో తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ భాషా పరీక్షలు జరిగాయి. కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు ఏర్పాటుచేశారు. ఉదయం తొమ్మిది గంటలకు పరీక్ష ప్రారంభమవ్వగా ఎక్కువ మంది విద్యార్థులు 8 గంటలకే కేంద్రాల వద్దకు చేరుకున్నారు. ఇంటర్ బోర్డు అధికారులు విస్తృత ప్రచారం చేయడంతో విద్యార్థులంతా నిర్దేశిత సమయం కంటే ముందుగానేకేంద్రాలకు చేరుకోవడంతో ఒక్క నిమిషం నిబంధన కారణంగా ఎవరినీ ఆపిన దాఖలాలు కన్పించలేదు. పరీక్షల నిర్వహణ తీరును ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్‌లు తనిఖీ చేశాయి.

32,668 మంది హాజరు

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా 106 కేంద్రాల్లో మొత్తం 33,638 మంది విద్యార్థులకుగాను 32,668 మంది పరీక్షకు హాజరయ్యారు. ఏలూరు జిల్లాలో 39 కేంద్రాల్లో 10809 మంది జనరల్ విద్యార్థులకు 10,477 మంది హాజరవ్వగా 332 మంది గైర్హాజరయ్యారు. 1615 మంది ఒకేషనల్ విద్యార్థులకు 1487 మంది హాజరవ్వగా 128 మంది గైర్హాజరయ్యారు. పశ్చిమగోదావరి జిల్లాలో 52 కేంద్రాల్లో 14,897 మంది జనరల్ విద్యార్థులకు 14,584 మంది హాజరవ్వగా 313 మంది గైర్హాజరయ్యారు. 1539 మంది ఒకేషనల్ విద్యార్థులకు 1436 మంది హాజరవ్వగా 103 మంది గైర్హాజరయ్యారు. తూర్పుగోదావరి జిల్లా పరిధిలోని 15 కేంద్రాల్లో 4,097 మందికి 4038 మంది హాజరవ్వగా 59 మంది గైర్హాజరయ్యారు. 681 మంది ఒకేషనల్ విద్యార్థులకు 646 మంది హాజరయ్యారు. మొత్తంగా 97 శాతం హాజరు నమోదైంది. కొవ్వూరులో ఒక మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదైంది. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఇంటర్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖర్‌బాబు తెలిపారు.

ఏలూరులో పరీక్షా కేంద్రం వద్ద విద్యార్థులు

కాలుష్య నియంత్రణలో ప్రభుత్వం విఫలం : సిపిఎం

ప్రజాశక్తి - తణుకు రూరల్

జిల్లాలో కాలుష్య సమస్య రోజురోజుకీ తీవ్రమవుతుందని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న విధానాలపై స్థానిక అమరవీరుల భవనంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి.ప్రతాప్ అధ్యక్షతన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ కాలుష్యం వల్ల జిల్లాలో ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. ఇటీవల కాలంలో జిల్లాలో కాలుష్యంపై కొన్ని సంస్థలు అధ్యాయనం చేశాయన్నారు. జిల్లాలో పంట కాలువలు, జల వనరుల్లో కాలుష్య తీవ్రత పెరుగుతుందని, బ్యాక్టీరియా విపరీతమైన స్థాయిలో ఉందని తెలిపారని వివరించారు. దీనివల్ల గుండె, లివర్, కిడ్నీ సంబంధిత వ్యాధులు, చర్మవ్యాధులు, కేన్సర్ వంటివి జిల్లాలో విపరీతంగా పెరుగుతున్నాయని అధ్యాయన నివేదికల్లో వారు చెప్పారన్నారు. ప్రభుత్వం తక్షణం జిల్లాలోని కాలుష్య సమస్యపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. గతంలో కాలుష్య సమస్యపై సిపిఎం పెద్దఎత్తున పాదయాత్ర చేయడం ద్వారా అప్పటి ఉమ్మడి కలెక్టరేట్‌ను వందలాది మందితో ముట్టడించడం ద్వారా ఈ కాలుష్యాన్ని ఒక ఎజెండా మీదకు తీసుకు వచ్చిందన్నారు. అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం స్పందించి కొన్ని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చిందన్నారు. ఆ తరువాత ప్రభుత్వం ఏ విధమైన చర్యలూ తీసుకోలేదని విమర్శించారు. ప్రధానంగా పరిశ్రమల వల్ల కాలుష్యం వస్తుందని, చట్ట ప్రకారం శుద్ధి చేయాల్సిన ట్రిట్‌మెంట్‌ప్లాంట్‌లను పరిశ్రమల్లో అమలు చేయడం లేదన్నారు. మున్సిపల్ వ్యర్థాలన్నీ జలవనరుల్లో కలిసి ప్రమాదానికి కారణమవుతున్నాయన్నారు. జిల్లాలోని కొన్నిచోట్ల రొయ్యల సాగు వల్ల ఆ ఉప్పునీటి కాలుష్యం కూడా పక్కన ఉన్న పేద రైతుల పంటలకు ముప్పు వాటిల్లుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కేతా గోపాలన్ పాల్గొన్నారు.

20న చలో విజయవాడను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల 20న చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కళ్యాణి కోరారు. పాలకొల్లు మహిళా భవన్‌లో వై.రాణి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కళ్యాణి మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చి వేతనాలు పెంచాలని కోరారు. అంగన్‌వాడీలకు ఫేస్ యాప్ రద్దు చేసి, పర్యవేక్షణ పేరుతో వేధింపులు ఆపాలని కళ్యాణి డిమాండ్ చేశారు. జిఒ 1ని రద్దు చేయాలని కోరారు. అనంతరం అసెంబ్లీ ముట్టడి వాల్ పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో పెద్దింట్లు, రాయుడు కుమారి, రాజమాని, పి.పద్మావతి, జి.రూప్సి, ఝాని, యలమంచిలి, పాలకొల్లు సిఐటియు మండల కార్యదర్శులు దేవ సుధాకర్, జవ్వాది శ్రీనివాస్ పాల్గొన్నారు.

చలో ఢిల్లీని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కండెల్లి సోమరాజు పిలుపునిచ్చారు. గురువారం కృష్ణయ్యపాలెం గ్రామంలో ఉపాధి పని ప్రదేశంలో కూలీలతో ఆయన మాట్లాడారు. ఉపాధి కూలీలు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. వేతన బకాయిలు చెల్లించాలని, రెండు పూటల పని విధానాన్ని రద్దు చేయాలని కోరారు.

క్యాంపస్‌లో ఎస్‌కెఎస్‌డి విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి - తణుకురూరల్

ఈనెల 12న తాడేపల్లిగూడెం జిఎంఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన ఒన్పోసిస్ ప్రాంగణ ఎంపికల్లో ఎస్‌కెఎస్‌డి మహిళా డిగ్రీ, పీజీ (అటానమస్) కళాశాల విద్యార్థినులు 16 మంది ఎంపికయ్యారని గురువారం కళాశాల ప్రిన్సిపల్ కరుటూరి రామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఎంపికైన వారికి వార్షిక ఆదాయం రూ.3 లక్షలు అని, విద్యార్థినులు ఇటువంటి కంపెనీలో ఉద్యోగం సాధించడం గర్వంగా ఉందని తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను కళాశాల కరస్పాండెంట్ చిట్టూరి సత్యఉషారాణి, జాయింట్ సెక్రటరీ చిట్టూరి వెంకటకృష్ణారావు, పరిపాలనాధికారి డి.సుబ్బారావు తదితరులు అభినందించారు.

గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పెదతాడేపల్లి గురుకుల పాఠశాలలో 2023-24 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్ ప్రవేశానికి ఈ నెల 24వ తేదీ వరకూ ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలని పెదతాడేపల్లి అంబేద్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ బి.రాజారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐదో తరగతిలో ప్రవేశానికి నాలుగో తరగతి పూర్తి చేసి ఉండాలని పేర్కొన్నారు. 1 సెప్టెంబర్ 2010 నుండి 31 ఆగస్టు 2014 మధ్య జన్మించిన వారై ఉండాలని తెలిపారు. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.లక్ష మించకూడదని తెలిపారు. అలాగే ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశానికి దరఖాస్తు చేసుకునే విద్యార్థులు 2022-23లో ఆంగ్ల మాధ్యమంలో పదో తరగతి పూర్తి చేసి ఉండాలని తెలిపారు. ఐదో తరగతికి 960 సీట్లు, ఇంటర్మీడియట్ కు 720 సీట్లు ఉన్నాయని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు http//:apg- pcet.apcf-ss.in ద్వారా ఆన్‌లైన్‌లో గాని, గురుకుల పాఠశాలలో కానీ సంప్రదించాలని తెలిపారు. విద్యార్థులు ఆధార్, తెల్ల రేషన్ కార్డు, కుల ధృవీకరణ పత్రం, పాస్ పోర్ట్ సైజ్ ఫోటోతో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఏప్రిల్ 23వ తేదీన ఉమ్మడి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం రెండు గంటలకు ఇంటర్ ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

స్వమిత్వ సర్వేను త్వరగా పూర్తి చేయండి

ప్రజాశక్తి - వీరవాసరం

స్వమిత్వ సర్వే సత్వరమే పూర్తి చేసి రికార్డులు తయారు చేయాలని డిపిఒ నాగలత కార్యదర్శులకు ఆదేశించారు. స్వమిత్వ సర్వే క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా ఆమె గురువారం మండలంలో పర్యటించారు. పరిశీలనలో భాగంగా ఆమె అండలూరు, తోలకపూడి పంచాయతీలను పరిశీలించారు. అండలూరులో వేస్ట్ మేనేజ్‌మెంట్ షెడ్డును పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. అదేవిధంగా పంచాయతీల్లో పన్నుల వసూలుపై ఆరా తీశారు. త్వరగతిన డిమాండ్‌కు అనుగుణంగా నూరు శాతం పన్ను వసూళ్లు చేయాలని ఆదేశించారు. ఆమె వెంట వేస్ట్ మేనేజ్‌మెంట్ కో ఆర్డినేటర్ ఎడ్వర్ట్ ఉన్నారు.

ఆకివీడు : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన స్వమిత్ర పథకంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన జగనన్న శాశ్వత భూ హక్కు రక్షా పథకం కార్యక్రమం మండలంలో గ్రామ కార్యదర్శులు ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని ఎండిఒ శ్రీకర్, సీనియర్ పంచాయతీరాజ్ కార్యదర్శి గ్రేడ్ వన్ కార్యదర్శి జి.నారాయణరావు ప్రారంభించి పలు సూచనలు చేశారు. గురువారం మండలంలోని కార్యదర్శులు అందరూ సంయుక్తంగా మొదటి రోజు కొద్దిసేపు సర్వే నిర్వహించారు.

మార్టేరు పాలిటెక్నిక్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మార్టేరు వ్యవసాయ పాలిటెక్నిక్ విద్యార్థులు ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రాష్ట్రస్థాయిలో నిర్వహించిన 'ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్, గేమ్స్, కల్చరల్ అండ్ లిటరరీ మీట్-2023'లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఛాంపియన్ షిప్ సాధించారు. ఈ సందర్భంగా సంస్థ ఎడిఆర్, ప్రిన్సిపల్ టి.శ్రీనివాస్ అధ్యక్షతన గురువారం అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ 21 వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలకు చెందిన 420 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. ఈ పోటీల్లో ఛాంపియన్ షిప్‌ను సాధించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా టి.శ్రీనివాస్ విజేతలను అభినందించారు. వారి విజయానికి కారకులైన ఫిజికల్ డైరెక్టర్ కె.శ్రీనివాసరెడ్డి, స్టూడెంట్స్ యాక్టివిటీస్ ఇన్‌ఛార్జి సిహెచ్ గణపతికి ప్రత్యేక అభినందలు తెలిపారు.

పంచాయతీకి కంప్యూటర్ అందజేత

ప్రజాశక్తి - మొగల్తూరు

పంచాయతీ పాలకవర్గ సభ్యులకు దాతలు గురువారం కంప్యూటర్ అందజేశారు. విశ్రాంత ఉపాధ్యాయులు మలపాక రామ సూర్యనారాయణ ఎంఆర్ఎస్ జ్ఞాపకార్థం వారి తనయులు పేరుశాస్త్రి, విశ్రాంత షార్ డైరెక్టర్ ఎంవైఎస్ ప్రసాద్, వాసుదేవ మూర్తి సుమారు రూ.50 వేలు వెచ్చించి పంచాయతీ రికార్డులు భద్రపర్చుకునేందుకు కంప్యూటర్‌ను పంచాయతీ పాలకవర్గ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా సర్పంచి పడవల మేరీ సత్యనారాయణ వారిని సత్కరించారు. కార్యక్రమాల్లో అనంతపల్లి రాధాకృష్ణ, పువ్వాడ రాజా, శేషగిరి, రాయుడు లక్ష్మణుడు, ఇఒపిఆర్‌డి మేడిది నవీన్‌కిరణ్ పాల్గొన్నారు.

టిడిపి బలోపేతానికి కృషి చేయాలి : పితాని

ప్రజాశక్తి - పోడూరు

గ్రామ స్థాయి నుంచే టిడిపి బలోపేతానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మాజీ మంత్రి పితాని స్యనారాయణ అన్నారు. గురువారం మండలంలోని పి.పోలవరం, మినిమించిలి పాడు, కవిటం గ్రామాల్లో గ్రామ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024లో టిడిపి గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. అలాగే వైసిపి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణరాజు, కార్యదర్శి బొక్క సూర్యనారాయణ, గణపతినీడి రాంబాబు, గుబ్బల రాంబాబు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో గుండెపోటుతో వ్యక్తి మృతి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు రైల్వేస్టేషన్లో గుండెపోటుతో గోరింటాడకు చెందిన వ్యక్తి మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గోరింటాకు చెందిన చెల్లుబోయిన యశోద్ కుమార్ (46) హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. అయితే బుధవారం సాయంత్రం హైదరాబాద్ వెళ్లేందుకు కుమార్ నర్సాపూర్ - లింగంపల్లి ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కేందుకు ఫ్లాట్ ఫారం -1 నుంచి రెండుకు వెళ్తుండగా గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలాడు. ఆ సమయంలో ఆయన సోదరుడు విజయ శేఖర్ పక్కనే ఉన్నారు. అయితే అప్పటికే కుమార్ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన మతి పట్ల గోరింటాడ సర్పంచ్ మండెల పావని నాని సంతాపం తెలిపారు.దీంతో వై వారి కుటుంబంలో విషాదం నెలకొంది.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ

విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదు..

పి.విజయ భాస్కర్, జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్, ఆకివీడు

10వ తరగతి విద్యార్థులను ప్రత్యేక ప్రణాళికతో పరీక్షలకు సన్నద్ధం చేస్తున్నాం. జిల్లా విద్యాశాఖ అధికారి ఆదేశాల మేరకు 40 రోజుల ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నాం. పాఠశాల సమయంలోనే కాకుండా అదనంగా ప్రతిరోజూ ఉదయం గంట, సాయంత్రం గంట చదివిస్తున్నాం. సబ్జెక్టుల వారీగా చదివిస్తూ రోజూ పరీక్షలు నిర్వహిస్తున్నాం. తల్లిదండ్రులతో చర్చించి విద్యార్థుల పట్ల శ్రద్ధ చూపాలని చెబుతున్నాం. నూరు శాతం ఉత్తీర్ణతే తమ లక్ష్యం.

మెరుగైన విద్యనందిస్తున్నాం..

ఎన్ఎస్‌వి.బాలకృష్ణ , జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం, ఉనుదుర్రు, ఉండి మండలం

ప్రతి విద్యార్థీ ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించేందుకు ఆరు నెలల నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్నాం. తమ పాఠశాలలో 12 మంది పదో తరగతి విద్యార్థులు ఉన్నారు. వారికి ఆరు నెలల నుంచి సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామం. ప్రతి విద్యార్థీ పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. స్టడీ అవర్స్ పట్టికను అమలు చేస్తున్నాం. ఉదయం, సాయంత్ర వేళల్లో అదనపు తరగతులు నిర్వహిస్తున్నాం.

ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం..

పొట్ల రాము, కోలమూరు పికెపిఎం హైస్కూల్ హెచ్ఎం, ఉండి

ప్రతి ఉపాధ్యాయుడూ ముగ్గురు విద్యార్థులను దత్తత చేసుకుని చదివిస్తున్నారు. తమ పాఠశాలలో తెలుగు మీడియం చదివే విద్యార్థులు 13 మంది, ఇంగ్లీష్ మీడియం చదివే విద్యార్థులు 18 మంది ఉన్నారు. వారిని ఎస్ఎ 1 పరీక్షల ఆధారంగా ఎ, బి, సి, డి గ్రేడ్లుగా వర్గీకరించాం. సి, డి గ్రేడు విద్యార్థులకు ఉదయం 8:30 నుంచి 9 :15 నిమిషాల వరకూ, సాయంత్రం 4:00 గంటల నుంచి 5:30 నిమిషాల వరకూ ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. గత సంవత్సరాల పరీక్షా ప్రశ్నాపత్రాల ఆధారంగా ముఖ్యమైన ప్రశ్నలు చదివిస్తున్నాం.

టైం టేబుల్ ప్రకారం విద్యాబోధన

ఎస్‌కెఎస్.రాఘవాచారి,ఎస్‌టివిఎన్‌హెచ్‌హెచ్ స్కూల్ హెచ్ఎం, పెంటపాడు

పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. తమ స్కూల్ నుంచి 11 మంది పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకూ తరగతులు నిర్వహిస్తున్నాం. తల్లిదండ్రులు పిల్లలు టీవీ చూడకుండా చూడాలి. ఇంటి దగ్గర శ్రద్ధ తీసుకుంటే నూరు శాతం ఉత్తీర్ణత సాధించవచ్చు. జిల్లా అధికారులు ఇచ్చిన టైం టేబుల్ ప్రకారం విద్యాబోధన చేస్తున్నాం. ఏప్రిల్ 3 నుంచి 15వ తేదీ వరకూ పరీక్షలు జరగనున్నాయి.

సీనియర్ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ప్రజాశక్తి - ఆకివీడు

సీనియర్ ఇంటర్ పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు మండలంలో మూడు కేంద్రాలకు 560 మంది విద్యార్థులు హాజరయ్యారు. 24 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. బుధవారం మొదటిరోజు మొదటి సంవత్సరం 637 మంది హాజరయ్యారు. రెండు పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. గురువారం జరిగిన పరీక్షకు గంట ముందే గేట్లు వేసేసి విద్యార్థుల పూర్తి స్థాయిలో తనిఖీ చేసి మరీ ఒక్కరొకరిగా లోపలికి పంపించారు.

ఆచంట : సీనియర్ ఇంటర్‌లో తెలుగు పరీక్షకు ఎంవిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 132 విద్యార్థులకు గాను 126 మంది హాజరు కాగా ఆరుగురు గైర్హాజరైనట్లు ఎగ్జామినేషన్ చీఫ్ సూపరింటెండెంట్ కె.సోని తెలిపారు. ఎటువంటి అవాంతరాలు లేకుండా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు.

ఉండి : యండగండి ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రంలో గురువారం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం ఇంగ్లీష్ పరీక్షకు ముగ్గురు విద్యార్థులు గైర్హాజరయ్యారని, 176 మంది విద్యార్థులు హాజరయ్యారని కళాశాల చీఫ్ సూపరింటెండెంట్ ఉండా దుర్గారావు తెలిపారు. ఈ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో, సీసీ కెమెరా పర్యవేక్షణలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పొట్టి శ్రీరాములును ఆదర్శంగా తీసుకోవాలి

ప్రజాశక్తి - భీమవరం

ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి, ప్రాణాలర్పించి పొట్టి శ్రీరాములు అమరజీవిగా మనందరి మదిలో చిరస్థాయిగా మిగిలారని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. గురువారం పొట్టి శ్రీరాములు జయంతి జిల్లా కలెక్టరేట్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీరాములు చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు విశేషకృషి చేసిన మహాపురుషుడు పొట్టి శ్రీరాములు అన్నారు. పొట్టి శ్రీరాములు స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలన్నారు. ఇన్‌ఛార్జి జెసి ఎం.సూర్య తేజ మాట్లాడుతూ తెలుగు ప్రాంత అభివృద్ధి కోసం, ప్రత్యేక రాష్ట్రం సాధన కోసం 58 రోజులు నిరాహార దీక్ష చేసి రాష్ట్ర సాధనకు కృషి చేసిన వ్యక్తి అన్నారు. ఈ సందర్భంగా 133 మంది సాంఘిక సంక్షేమ శాఖ, బిసి సంక్షేమ శాఖ పదవ తరగతి విద్యార్థులకు జియో కిమ్ వారు అందజేసిన ఆల్ ఇన్ వన్ గైడ్స్ పుస్తకాలను కలెక్టరు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి గణపతిరావు, ఆర్‌డిఒ దాసి రాజు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.భీమవరం ఆర్‌డిఒ దాసి రాజు సతీమణి ఎల్‌జి సౌజన్య ఆర్థిక సహకారంతో తండ్రి లింగం జోషి పేరున కలెక్టరేట్లో ఏర్పాటు చేసిన పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని జిల్లా కలెక్టర్ ప్రశాంతి ఆవిష్కరించారు.

భీమవరం : పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్

భీమవరం రూరల్ :భాషా ప్రయోక్త రాష్ట్రాల ఏర్పాటుకు ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని జిల్లా అడిషనల్ ఎస్‌పి ఎవి సుబ్బరాజు కొనియాడారు. పొట్టి శ్రీరాములు జయంతిని జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా అడిషనల్ ఎస్‌పి సుబ్బరాజు ముఖ్య అతిథిగా హాజరై పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం శ్రీరాములు ఆమరణ నిరాహార దీక్ష చేపట్టారన్నారు. పొట్టి శ్రీరాములు మరణానంతరం ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిందన్నారు. అనంతరం పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి ఎఆర్ డిఎస్‌పి ఎం.సత్యనారాయణ, ఆర్ఆర్ఐ శ్రీకాంత్, డిపిఒ ఎఒ రామ్మోహన్ తదితరులు నివాళులర్పించారు.

అత్తిలి : ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహారదీక్ష చేసి, ప్రాణాలర్పించిన మహనీయుడు పొట్టి శ్రీరాములని ఎంపిడిఒ వివివిఎస్.రామారావు కొనియాడారు. ఎంపిడిఒ కార్యాలయంలో గురువారం పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి ఎం.శ్రీనివాసరావు, ఎన్ఆర్ఇజిఎస్ సిబ్బంది, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెనుమంట్ర : మార్టేరు వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌ఛార్జి ఎడిఆర్ ఎం.చారుమతి, ప్రధాన శాస్త్రవేత్త కెఎం.దక్షిణామూర్తి, మరో శాస్త్రవేత్త బి.అనూష ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

పోడూరు : విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుండే పోటీతత్వం అలవర్చుకోవాలని కనకదుర్గ, వాసవి స్వచ్ఛంద సేవాసంస్థ ఛైర్మన్ బేతాలం సూర్యనారాయణ పిలుపునిచ్చారు. పోడూరు శివారు కొత్తపేట ప్రాథమిక పాఠశాలలో సంస్థ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతిని నిర్వహించారు. ముందుగా శ్రీరాములు చిత్రపటానికి సంస్థ ఛైర్మన్ సూర్యనారాయణ, పాఠశాల హెచ్ఎం కేతా నాగరాజు, పిఎంసి ఛైర్మన్ చిట్టూరి నరసింహారావు నివాళులర్పించారు. అనంతరం పాఠశాలలో 34 మంది విద్యార్థులకు సంస్థ తరుపున భోజనం ప్లేట్లు అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో పిఎంసి వైస్ ఛైర్మన్ కత్తుల సుధ, వాసా దుర్గారావు, వై.శ్రీను పాల్గొన్నారు.

మొగల్తూరు : అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని విగ్రహ దాతలు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యాలయ సమీపంలోని శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి పడవల మేరి సత్యనారాయణ, పువ్వాడ శేషగిరి, రాజా, పొత్తూరి శివ పాల్గొన్నారు. వాసవీ, వనిత క్లబ్ సభ్యులు శ్రీరాములు విగ్రహానికి నివాళు లర్పించారు. అలాగే ఆర్యవైశ్య యువజన సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. మహాత్మా గాంధీ బోధించిన సత్యం, అహింస మార్గాల్లో నడిచిన మహా పురుషుడు పొట్టి శ్రీరాములు అన్నారు. అనంతరం మొగల్తూరులోని ఆర్యవైశ్య కళ్యాణమండపం, గాంధీ బొమ్మ సెంటర్లోని పొట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలవేసి సంఘ సభ్యులు ఘనంగా నివాళు లర్పించారు. ఆయా కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ గ్రామ అధ్యక్షులు ఎస్ఎంఆర్ నాగేశ్వరరావు, యూత్ అధ్యక్షులు సంక గుప్తా, కార్యదర్శి, సీమకుర్తి బాలాజీ పాల్గొన్నారు.

పాలకొల్లు : స్థానిక జివిఎస్‌వి ఆర్ఎం మున్సిపల్ పాఠశాలలో జెసిఐ పాలకొల్లు రైజింగ్ ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మౌని కావలి మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే దేశభక్తిని గుండెల్లో నింపుకున్న వ్యక్తి శ్రీరాములు అన్నారు. ఈ కార్యక్రమంలో కారుమూరి సబిత, రేపాక మీనా మణి, హెచ్ఎం రాయపూడి భవాని ప్రసాద్ పాల్గొన్నారు.

హమాలీల సమస్యలు పరిష్కరించాలని ధర్నా

ప్రజాశక్తి - తణుకురూరల్

ఎపిఎస్ఎస్‌డిసి అధికారుల ఏకపక్ష నిర్ణయాలు మానుకోవాలని, హమాలీలకు న్యాయం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి ప్రతాప్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎపిఎస్ఎస్‌డిసి హమాలీస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి, అనంతరం తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ తణుకు ఎపిఎస్ఎస్‌డిసి యూనిట్‌లో 15 మంది హమాలీలు అనేక సంవత్సరాలుగా సేవలందిస్తున్నారన్నారు. ప్రతి రెండు సంవత్సరాలకోసారి రేట్ల పెంపుదల జరుగుతుందన్నారు. ఎపిఎస్ఎస్‌డిసి సంస్థలు రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 18 యూనిట్లు ఉన్నాయని, రాష్ట్ర వ్యాప్తంగా ఒకే పని విధానం ఉన్నప్పటికీ ఒకే అగ్రిమెంట్ అనేది లేదని అన్నారు. ఒక్కోక్క చోట ఒక్కో అగ్రిమెంట్ విధానం ఉందని తెలిపారు. అనేక సంవత్సరాలుగా శ్రీకాళహస్తి హమాలీ రేట్లు అమలు చేయాలని కోరారని తెలిపారు. ఇప్పుడు రాష్ట్రంలో ఎక్కడా లేని టెండర్ విధానం తణుకు యూనిట్ హమాలీ కార్మికులపై కక్ష సాధించడానికి తీసుకొచ్చారని విమర్శించారు. ఈ విషయాలు పరిగణించి హమాలీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కామన మునిస్వామి, టి.రామకృష్ణ గాది త్రిమూర్తులు, రమణ, సాంబశివరావు, బి.శ్రీహరి పాల్గొన్నారు.

తహశీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

'కాళ్ల జెడ్‌పిటిసికి జెడ్‌పి ఛైర్మన్ పదవి ఇవ్వాలి'

ప్రజాశక్తి - కాళ్ల

రాష్ట్రంలో బిసిలకు అధిక ప్రాధాన్యతిస్తూ అండగా ఉంటున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి కాళ్ల జెడ్‌పిటిసి పచ్చిగోళ్ల సోమేశ్వరరావుకు జెడ్‌పి ఛైర్మన్ పదవి ఇవ్వాలని పలువురు బిసి నాయకులు కోరారు. పెదఅమిరంలోని వైసిపి కార్యాలయంలో ఉండి నియోజకవర్గ బిసి నాయకులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉండి ఎఎంసి మాజీ ఛైర్మన్ మన్నే నాగరాజు అధ్యక్షత వహించి మాట్లాడారు. మాజీ జడ్పిటిసి మన్నే పోతురాజు మాట్లాడారు. ఈ సమావేశంలో ఆకివీడు నగర పంచాయతీ ఛైర్ పర్సన్ జామి హైమావతి, నూకవరపు వెంకటేశ్వర్లు, రణస్థల మహంకాళి, సిరపు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించి చెరువును అప్పగించాలని వినతి

ప్రజాశక్తి - ఉండి

దళితులు వాడుకునే తాగునీటి చెరువును ఆక్రమించి ఎటువంటి అనుమతులు లేకుండా ఆ చెరువును పూడ్చి వేయడమే కాకుండా అక్కడ భగీరథుని విగ్రహం ఏర్పాటు చేయడం అత్యంత దారుణమని జై భీమ్ సంస్థ వ్యవస్థాపకులు తాళ్లూరి మధు, రాష్ట్ర అధ్యక్షులు కోన జోసెఫ్ అన్నారు. గురువారం ఎస్సి కమిషన్ ఛైర్మన్ మారుమూడి విక్టర్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ వెంటనే విగ్రహాన్ని తొలగించి చెరువును తమ కులస్తులకు అందజేయాలని వారు కోరారు. విక్టర్ ప్రసాద్‌ను కలిసిన వారిలో పాములపర్రు గ్రామస్తులు ఉన్నారు.

ఆటో కార్మికుల యూనియన్ మానవత్వం

తోటి కార్మికుని కుమార్తె వైద్యానికి రూ.2.36 లక్షలు సాయం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

తోటి కార్మికుని కష్టాన్ని తమ కష్టంగా భావించి వారంత అండగా నిలబడ్డారు. ఆటో కార్మికుడు గంగాధర్ కుమార్తె వైష్ణవి తలసేమియా వ్యాధితో బాధపడుతోంది. వైద్యానికి లక్షల్లో ఖర్చవుతుండడంతో గంగాధర్ దాతల సహాయం కోరాడు. ఇటీవల సోషల్ మీడియాలో వీడియో పెట్టాడు. చలించిన జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షులు ఇంటి సత్యనారాయణ, భీమవరం పట్టణ ఆటో వర్కింగ్ కమిటీ అధ్యక్షులు పంపన గోపి, పట్టణంలోని అన్ని ఆటో యూనియన్ల వద్దకు వెళ్లి సహాయనిధిని సేకరించారు. పది రోజులుగా సేకరించిన రూ.2,36,150ను గురువారం కుముదవల్లి రోడ్డు స్వయంకృషి 2 ఆటో యూనియన్ పాయింట్ వద్ద ప్రత్యేక సమావేశం నిర్వహించి చిన్నారి వైష్ణవి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయాన్ని పట్టణంలో ఆటో కార్మిక నాయకులు కార్మిక సోదరులు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆటో యూనియన్ అధ్యక్షులు ఇంటి సత్యనారాయణ, భీమవరం పట్టణ ఆటో యూనియన్ వర్కింగ్ కమిటీ అధ్యక్షులు పంపన గోపి, కడలి హరిబాబు, ఆరేపల్లి బాలాజీ,గోసాల కుమార్ , కమలాకర్, కృష్ణ, సతీష్ పాల్గొన్నారు.

నాడు-నేడు పనులు త్వరగా పూర్తి చేయాలి

ప్రజాశక్తి - మొగల్తూరు

నాడు-నేడు పనులను వేగవంతంగా పూర్తి చేయించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులకు ఇంజినీరింగ్ అసిస్టెంట్లకు ఎంపిడిఒ ఆర్‌సి.ఆనందకుమార్ సూచించారు. గురువారం సాయంత్రం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. ఈ నెలాఖరులోపు పనులన్నీ సకాలంలో పూర్తిచేసి నివేదిక అందించాలన్నారు. ఈ సందర్భంగా పాఠశాల వారీగా జరిగిన పనులపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంపై ఫిర్యాదు

తహశీల్దార్ విచారణ

ప్రజాశక్తి - పెనుగొండ

పెనుగొండ శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం ముఖద్వారం పక్కన దేవస్థానం వారు పంచాయతీ స్థలంలో మొక్కలు వేసేందుకు ఇనుప స్తంభాలు ఏర్పాటు చేయడంపై ఈ నెల 12వ తేదీన అడ్వకేట్ ఇందుగపల్లి రామానుజరావు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం పెనుగొండ తహశీల్దార్ ఎన్.గురుమూర్తిరెడ్డి విచారణ జరిపారు. ఆలయ ఇఒ జిఎస్‌వి.శ్రీనివాస్, ట్రస్ట్ బోర్డ్ ఛైర్మన్ కోట్ల రామకృష్ణ మోహనరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాతిన ఇనుప స్తంభాలను వెంటనే తీసివేయాలని దేవస్థానం ఇఒను తహశీల్దార్ ఆదేశించారు. అలాగే ఆలయానికి ఎదురుగా చెత్త వేయకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని పంచాయతీ ఇఒకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి సిహెచ్ఎస్.వెంకటరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

సురక్షిత నీరు అందించాలి : జనసేన

పోడూరు:గుమ్మలూరు గ్రామ పంచాయతీ పరిధిలో తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, కుళాయి ద్వారా సరఫరా చేసే నీరు పసరు రంగులో ఉండి మట్టి వాసన వస్తోందని, తక్షణం ప్రజలకు సురక్షిత నీరు అందించాలని జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి రావి హరీష్‌బాబు అన్నారు. ఈ సందర్భంగా ఆయన గురువారం విలేకరులతో మాట్లాడారు. దాదాపు 5 వేలకు పైగా జనాభా ఉన్న పంచాయతీ అధికారులకు, సర్పంచికి ఎన్ని సార్లు మొర పెట్టుకున్న స్పందించడం లేదన్నారు. తాగునీటి కోసం ప్రజలు రోజూ 8 కిలోమీటర్లు వెళ్లి పాలకొల్లు మున్సిపాల్టీ నీరు తెచ్చుకుంటున్నారని తెలిపారు. అధికారులు స్పందించి శుభ్రమైన నీటిని గ్రామస్తులకు అందించాలని కోరారు.

'వైసిపి పాలనలో ప్రజలకు కష్టాలు'

మొగల్తూరు:రాష్ట్రానికి సుస్థిర పాలన రావాలంటే టిడిపి అధికారంలోకి రావాలని పార్టీ నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. కెపిపాలెంలో రాష్ట్రానికి ఇదేం ఖర్మ కార్యక్రమాన్ని పార్టీ మండల అధ్యక్షులు గుబ్బల నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో ప్రజలు కష్టాలు పడుతున్నారని విమర్శించారు. కార్యక్రమంలో కత్తిమండ ముత్యాలరావు, బొక్క ఏడుకొండలు, పాల్గొన్నారు.

పాలకొల్లుకు గౌతమ్ రెడ్డి

ప్రజాశక్తి - పాలకొల్లు

ఎపి ఫైబర్ నెట్ కార్పొరేషన్ ఛైర్మన్ పి.గౌతమ్ రెడ్డి పాలకొల్లులోని న్యూలైఫ్ ఎమర్జెన్సీ అండ్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని గురువారం సందర్శించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గజల్‌శ్రీనివాస్ తల్లి రత్నావళిని పరామర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఐసియు, జనరల్ వార్డ్, విఐపి వార్డులను, అత్యాధునిక లాబ్, రిసెప్షన్, క్యాజువాలిటీ విభాగాలను సందర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర వైసిపి మహిళా నాయకురాలు లక్కంరాజు సునీత పాల్గొన్నారు.

కుముదవల్లిలో ఫ్యామిలీ ఫిజీషియన్

ప్రజాశక్తి - పాలకోడేరు

ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పాలకోడేరు పిహెచ్‌సి వైద్యురాలు డాక్టర్ స్వర్ణ నిరంజని అన్నారు. కుముదువల్లిలో పిహెచ్‌సి డ్రాయింగ్ అధికారి డాక్టర్ రంగం నాయుడు సూచనల మేరకు 104 సిబ్బంది సహాయంతో, పాలకోడేరు పిహెచ్‌సి సిబ్బందితో గురువారం ఫ్యామిలీ ఫిజీషియన్‌ను నిర్వహించారు. అనంతరం గర్భిణులు, బాలింతలను పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు నాగమణి, అయ్యప్ప శ్రీనివాస్, ఎంఎల్‌హెచ్‌పిలు మహాలక్ష్మి, వల్లి, ఎఎన్ఎం హేమలత, హెల్త్ అసిస్టెంట్ ఎం.విజయప్రసాద్, 104 సిబ్బంది పాల్గొన్నారు.

31న బార్ అసోసియేషన్ ఎన్నికలు

తణుకురూరల్: తణుకు బార్ అసోసియేషన్‌కు ఈ నెల 31వ తేదీన ఎన్నికలు జరగనున్నట్లు ఎన్నికల కమిటీ గురువారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఎన్నికలు 2023-24 సంవత్సరానికి అని తెలిపారు. ఈ ఎన్నికల్లో అసోసియేషన్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, జనరల్ కార్యదర్శి, సహాయ కార్యదర్శి, లైబ్రరీ కార్యదర్శి, ట్రెజరర్, స్పోర్ట్స్ కార్యదర్శి, లేడి రిప్రజెంటెట్, 10 మంది సభ్యుల పదవులకు పోటీ జరుగుతుందన్నారు. తణుకు కోర్టులో న్యాయవాదులు మొత్తం 331 మంది అని బార్ కౌన్సిల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లో తమ పేర్లను న్యాయవాది వృత్తిని చేసుకొనుటకు పేర్లు నమోదు చేసుకున్నారని వారిలో 300 మంది మాత్రమే ఓటు హక్కు కలిగి ఉన్నారని తెలిపారు. ఈ ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యులుగా కామన మునిస్వామి, గొల్లపల్లి అంబేద్కర్, వి వెంకటసత్యసాయి, నేతల సోమేశ్వరరావు ఉన్నారు.

విఆర్ఒను అడ్డుకున్న వారిపై కేసు

ఆకివీడు:విధులను నిర్వహించేందుకు వెళ్లిన విఆర్ఒను అడ్డుకున్న వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాజారెడ్డి తెలిపారు. కోలపురి గ్రామంలో అదే గ్రామానికి చెందిన గొట్టుముక్కల హేమాద్రి ప్రభుత్వ పోరంబోకు భూమిలోని వంటకాలువ నీటిపారుదలకు ఆటంకం కలిగించారు. అడ్డంగా ఉంచిన తోరలను తొలగించేందుకు గ్రామ రెవెన్యూ అధికారి బందా హరిచంద్ర ప్రసాద్ అక్కడికి వెళ్లారు. అక్కడ మరో కారు ఉంచి విఆర్ఒ విధులకు ఆటంకం కలిగించారు. విఆర్ఒ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రకటన

In the Court of the Hon'ble II Addl. Junior Civil Judge cum II Addl. Judl. First Class Magistrate, Tadepalligudem

I.A. No. 19/2021 in O.S. No. 42/2021

Between:
Sri Penumaka Davidu Raju
...Petitioner/ Plaintiff
AND
Smt. Kolli Lora and Others
...Respondents/ Defendants

To:
The Executive Officer (R-8)
Sri Sitaramanjaneya Swami Devastanam, Prathipadu Village, Pentapadu Mandal, Tadepalligudem JCJ.

పై నెంబరు గల సివిల్ కేసులో పైన తెలిపిన గౌరవ కోర్టు వారు మీకు సమన్లు జారీ చేసి మిమ్మల్ని కోర్టుకు హాజరు కావాలని ఆదేశించినప్పటికి, సదరు సమన్లను మీరు తీసుకోనందు వలన పైన తెలిపిన గౌరవ కోర్టు వారు ప్రత్యామ్నాయంగా ఈ పేపరు ప్రకటన ద్వారా సమన్లను మీకు సర్వీసు చేయమని ఆదేశించి యున్నారు. అందువలన మీకు తెలుపునది ఏమనగా పై నెంబరు కలిగిన సివిల్ కేసు ది. 20-03-2023వ తేదీకి వాయిదా పడి ఉన్నది. ఆ దినమున అనగా **ది. 20-03-2023వ తేదీన ఉదయం గం|| 10.30 ని||లకు** పైన తెలిపిన గౌరవ కోర్టు వారి ముందు తప్పనిసరిగా హాజరు కావలెను. ఆవిధంగా హాజరు కాని యెడల గౌరవ కోర్టు వారు మిమ్మల్ని ఎక్స్‌పార్టీ చేసి మీకు వ్యతిరేకంగా తీర్మానించెదరని యిందుమూలముగా మీకు తెలుపడమైనది.

R.VENKATESWARA RAO
Advocate, Tanuku
Cell: 9397151279
Tadepalligudem
Date: 16-03-2023